## క్లుప్తంగా

### మర్యాదపూర్వకంగా..



ఎస్పీని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్‌) : జిల్లా ఎస్పీ డాక్టర్‌ కె.తిరుమలేశ్వరరెడ్డిని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీని శాలువా, పూలమొక్కతో సత్కరించారు. అనంతరం పలు విషయాలపై వారు చర్చించుకున్నారు.

### సన్మానం



నెల్లూరు రూరల్‌ : జాతీయ చేనేతల దినోత్సవం సందర్భంగా రూరల్‌ పరిధిలోని సౌత్‌ మోపూరు గ్రామంలో రాష్ట్ర చేనేత సంఘం గౌరవాధ్యక్షుడు పముజుల దశరథరామయ్యను ఆయన నివాసంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పముజుల హరితో పాటు పలువురు చేనేత నేతలు సోమవారం సన్మానించారు. చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు సమైఖ్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

### పెన్నాలో పసికందు మృతదేహం

నెల్లూరు(క్రైమ్‌) : పెన్నానదిలో (రైల్వేబ్రిడ్జి కింద) రోజులు నిండని పసికందు(మగ) మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. స్థానిక వీఆర్వో సందానిబాషాకు సమాచారం అందడంతో ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వేణుగోపాల్‌ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో నీటిలో నుంచి చిన్నారి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. పురిటిలోనే మృతిచెందాడో? మరే ఇతర కారణమో తెలియాల్సి ఉంది.

### విద్యాసామగ్రి అందజేత



నెల్లూరు రూరల్‌ : కొత్తూరు పరిధిలోని చంద్రబాబునగర్‌ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శ్రామికనగర్‌, కుమ్మరగుంట, చంద్రబాబునగర్‌ ప్రాంతాల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వీఆర్వో సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు, నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో 30వ డివిజన్‌ కార్పొరేటర్‌ కుకాటి ప్రసాద్‌రావు, రూరల్‌ ఎంఈఓ మురళీ, వీఆర్వో సంస్థ ప్రతినిధి పీటర్‌ బోస్కో, కో–ఆర్డినేటర్‌ గోపాల్‌, కమ్యూనిటీ వర్కర్స్‌ రాజేశ్వరి, ధనలక్ష్మి, కోటేశ్వరమ్మ, జయంతి పాల్గొన్నారు.

### వృద్ధుడి ఆత్మహత్య



వృద్ధుడి మృతదేహం

నెల్లూరు(క్రైమ్‌): ఏం కష్టమొచ్చిందో కానీ గూడ్సు రైలు కింద పడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వేదాయపాళెం రైల్వేస్టేషన్‌ యార్డు వద్ద నెల్లూరు వైపు వచ్చే రైలు పట్టాలపై సోమవారం చోటు చేసుకుంది. మృతుడు 65 నుంచి 70ఏళ్లలోపు కలిగి ఉండి నలుపు, తెలుపు రంగు గళ్ల ఫుల్‌హ్యాండ్స్‌ చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై బీవీఎస్‌కే, కుడి వైపు ఛాతిపైన ఆంగ్లం, ఎడమ వైపు ఛాతిపైన తెలుగులో సాయి అని పచ్చబొట్లు ఉన్నాయి. నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్‌ హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్‌ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

### గద్దర్‌కు నివాళి



వెంకటాచలం: మండలంలోని సరస్వతి నగర్‌ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో సోమవారం ప్రజా గాయకుడు గద్దర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్రం డైరెక్టర్‌ మాడభూషి సంపత్‌కుమార్‌ మాట్లాడుతూ గద్దర్‌ తన పాట, ఆట, మాటల ద్వారా యావత్‌ తెలుగు సమాజంలో చైతన్యం తెచ్చారని కొనియాడారు. గద్దర్‌ చేసిన అనేక కార్యక్రమాలు ఎంతో గుర్తింపు పొందాయని తెలియజేశారు. పేదల బాధల్ని తన పాటల ద్వారా వినిపించి సమాజాన్ని మేల్కొలిపారని చెప్పారు.

# ‘జగనన్నకు చెబుదాం’ అర్జీలపై దృష్టి పెట్టాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ హరినారాయణన్‌

• కలెక్టర్‌ ఎం హరినారాయణన్‌

నెల్లూరు(దర్గామిట్ట) : జగనన్నకు చెబుదాం (స్పందన) అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ ఎం.హరినారాయణన్‌ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో జేసీ కూర్మనాథ్‌, డీఆర్వో వెంకట నారాయణమ్మతో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సోమవారం కలెక్టర్‌ పాల్గొని, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చినప్పుడు సకాలంలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా వి.గాయత్రి అనే దివ్యాంగురాలికి బ్యాక్‌లాగ్‌ ఖాళీల భర్తీ కింద నియామక పత్రాన్ని కలెక్టర్‌ అందజేశారు. అలాగే పలువురు ఇలా వినతి పత్రాలు సమర్పించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు కలెక్టర్‌ కార్యాలయం వద్ద ధర్నా చేసి అర్జీ సమర్పించారు. నెల్లూరులో నివాసముంటున్న సలీం అనే వ్యక్తి ఏఎస్‌పేట మండలం శ్రీకొలను గ్రామంలో భూమిని రిజిస్టర్‌ చేసుకున్నానని, కొందరు వ్యక్తులు ఆ భూమిని నకిలీ పత్రాలతో వారి పేరు మీద రిజిస్టర్‌ చేసుకున్నారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ నిర్వహణ, జిల్లా అధికారి పనితీరుపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్‌ బీసీ విద్యార్థి ఫెడరేషన్‌ రాష్ట్ర కన్వీనర్‌ మురళీకృష్ణ యాదవ్‌ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో డీపీఓ సుస్మిత, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్‌ పీడీలు కె.సాంబశివారెడ్డి, హేనాసుజన్‌, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఈఓ గంగాభవాని, బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, సాంఘిక సంక్షేమాధికారి రమేష్‌, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్‌ చంద్రశేఖర్‌, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి నిర్మలాదేవి, హనుమాన్‌ ప్రసాద్‌, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డీసీసీబీ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

• వైఎస్సార్‌ ట్రేడ్‌ యూనియన్‌ ఒక్కరోజు వేతనం అందజేత



డీసీసీబీ సీఈఓ చేతుల మీదుగా విరాళాన్ని అందజేస్తున్న ట్రేడ్‌ యూనియన్‌ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌) : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నెల్లూరుటౌన్‌ బ్రాంచ్‌లో అసిస్టెంట్‌ మేనేజర్‌గా, వైఎస్సార్‌ ట్రేడ్‌ యూనియన్‌ అసోసియేషన్‌ జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ హోదాలో పనిచేసిన ఎస్వీ శ్రీధర్‌ (52) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో డీసీసీబీ వైఎస్సార్‌ ట్రేడ్‌ యూనియన్‌ సభ్యులు తమ ఒక్కరోజు వేతనం కింద రూ.1,80,513లు సేకరించారు. దీనిని నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌ వద్ద ఉన్న డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆ బ్యాంక్‌ సీఈఓ డాక్టర్‌ శంకర్‌ బాబు చేతుల మీదుగా చెక్కును శ్రీధర్‌ కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ ట్రేడ్‌ యూనియన్‌ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్‌, రాష్ట్ర మహిళా కార్యదర్శి ప్రజ్ఞ, జిల్లా అధ్యక్షురాలు సుష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి హరి, కోశాధికారి గురునాథం, నాయకులు సాజిద, నళిని, గాయత్రి, వరలక్ష్మి, తేజశ్విని, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు పునరావృతం కాకూడదు

• సమస్యలను సకాలంలో పరిష్కరించాలి
• కమిషనర్‌ వికాస్‌మర్మత్‌



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్‌ వికాస్‌మర్మత్‌

నెల్లూరు(బారకాసు) : స్పందన కార్యక్రమంలో వస్తున్న ఫిర్యాదులు పునరావృతం కాకూడదని, సకాలంలో పరిష్కరించాలని కమిషనర్‌ వికాస్‌ మర్మత్‌ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన వేదికలో డయల్‌ యువర్‌ కమిషనర్‌ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పది ఫోన్‌ కాల్స్‌ను స్వీకరించారు. వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత విభాగ అధికారులకు తెలియజేసి గడువులోపు పరిష్కారం అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన 35 అర్జీలకు సంబంధించిన సమస్యలను గడువులోపు పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. శానిటేషన్‌కు సంబంధించి చాలా వరకు సమస్యలు తగ్గిపోయాయని, అధికంగా టౌన్‌ప్లానింగ్‌ విభాగానికి సంబంధించి అర్జీలు వస్తున్నాయన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్‌ కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేత రంగంపై జీఎస్టీని రద్దు చేయాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న చేనేత కార్మిక సంఘ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌) : చేనేత రంగంపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీని రద్దు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి, చైతన్య డిమాండ్‌ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌ వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో చేనేత పరిశ్రమలను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం యతిస్తోందని, అందులో భాగంగానే చేనేత కార్మికులకు బదులుగా పవర్‌లూమ్‌ యాజమాన్యాలకు పలు సబ్సిడీలు అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తమకు నిలిపివేసిన జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలను వయస్సుతో సంబంధం లేకుండా తిరిగి అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. నగరంలోని ఆప్కో స్థలాన్ని పరిరక్షించాలని, చేనేత అనుబంధ వృత్తుల వారికి కూడా వైఎస్సార్‌ నేతన్న నేస్తం అందజేయాలని, చేనేతలకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నేతలు రామరాజు, పముజుల దశరథరామయ్య, వెంకటేశ్వర్లు, మాలకొండయ్య పాల్గొన్నారు.

## ‘వార్డు నంబర్‌–54’ ఆడియో లాంచ్‌



ఆడియో వేడుకలో పాల్గొన్న అతిథులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని వీఆర్సీ మైదానంలో ‘వార్డు నంబర్‌–54’ చిత్ర ఆడియో లాంచ్‌ ఆదివారం రాత్రి వేడుకగా జరిగింది. ఈ చిత్రానికి పి.మల్లికార్జునరావు దర్శకత్వం వహించగా, ఆడియో వేడుకకు ముఖ్యఅతిథులుగా ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్‌, వకీల్‌సాబ్‌ ఫేమ్‌ అనన్య, 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్పీ పట్నాయక్‌ మాట్లాడుతూ తాను అడవిలో పుట్టి, పెరిగానని కానీ తనకు సినిమా పరిశ్రమ ద్వారా మంచి గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు అజయ్‌పట్నాయక్‌, హాస్య నటుడు అప్పారావు, 25 కళా సంఘాల కన్వీనర్లు అమీర్‌జాన్‌, ఎస్‌.హరనాథ్‌రెడ్డి, భాస్కర్‌, రాజు పాల్గొన్నారు.

## వ్యక్తిని ఢీకొన్న మోటార్‌బైక్‌

బుచ్చిరెడ్డిపాళెం: వాకింగ్‌ చేస్తున్న కొమ్మి వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తి మోటార్‌బైక్‌పై వెళ్తూ వెనుక నుంచి ఢీకొన్న ఘటన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని కేఎం ఆస్పత్రి వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీస్‌ల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వెంకటేశ్వర్లు వేకువజామున రోడ్డు మార్జిన్‌లో వాకింగ్‌ చేస్తున్నాడు. ఈ సమయంలో సంగం నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న బైక్‌ అతి వేగంగా వెంకటేశ్వర్లును ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రైవేట్‌ వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీర ప్రతాప్‌ తెలిపారు.

### టిడ్కో గృహాలకు దరఖాస్తుల ఆహ్వానం

• కమిషనర్‌ వికాస్‌మర్మత్‌

నెల్లూరు(బారకాసు) : ప్రధాన మంత్రి ఆవాస్‌ యోజన పథకం కింద వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లోని ఏపీటిడ్కో(జీ+3) గృహ సముదాయాల్లో 365 ఎస్‌ఎఫ్‌టీ, 430 ఎస్‌ఎఫ్‌టీ గృహాలను సొంతం చేసుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని కమిషనర్‌ వికాస్‌మర్మత్‌ కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేటాయించిన లబ్ధిదారుల్లో కొందరు రిజిస్ట్రేషన్‌కు ముందు గృహాలను తీసుకునేందుకు అయిష్టత చూపిస్తున్నారని, అటువంటి లబ్ధిదారులకు కేటాయింపును రద్దు చేసి, కొత్త వారిని ఎంపిక చేసేందుకు ప్రభుత్వం జీఓ జారీచేసి ఉందన్నారు. 365 ఎస్‌ఎఫ్‌టీ విస్తీర్ణ గృహానికి ముందుగా రూ.25 వేలు చెల్లించాలన్నారు. అలాగే 430 ఎస్‌ఎఫ్‌టీ విస్తీర్ణ గృహానికి ముందస్తుగా రూ.50 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆసక్తి కలిగిన వారు నగరపాలక సంస్థ పరిధిలో నివాసం ఉండి, తెల్లరేషన్‌ కార్డు కలిగిన వారు సంస్థ కార్యాలయంలో రేషన్‌, ఆధార్‌, బ్యాంకు పాస్‌బుక్‌, పాన్‌కార్డు జెరాక్స్‌ కాపీలతో సమర్పించి రసీదు పొందాలన్నారు.

### పాలిటెక్నిక్‌ ప్రవేశాలను తక్షణమే చేపట్టాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌) : పాలిటెక్నిక్‌ ప్రవేశాలకు సంబంధించిన ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీహర్ష సోమవారం ప్రకటనలో కోరారు. పాలిసెట్‌కు లక్ష 41 వేల మంది హాజరు కాగా వారిలో లక్ష 20 వేల మంది ఉత్తీర్ణత సాధించారని, పాలిసెట్‌ నిర్వహించి 76 రోజులు గడుస్తున్నా అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారం రోజుల్లో వెబ్‌ఆప్షన్స్‌ ప్రారంభించాలని కోరారు.

### సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

• మేయర్‌ స్రవంతి

నెల్లూరు రూరల్‌ : ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని మేయర్‌ స్రవంతి సచివాలయ సిబ్బందికి సూచించారు. నెల్లూరు నగరంలోని 12వ డివిజన్‌ అల్లీపురంలో ఉన్న 12/1 సచివాలయాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని అన్ని రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందించే సేవల్లో సచివాలయ కార్యదర్శులంతా నిబద్ధత పాటించాలని సూచించారు. పరిష్కరించలేని ఫిర్యాదులను నగరపాలక సంస్థలోని తమ కార్యాలయం దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి శాశ్వత పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు సంబంధించిన ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### హిరోషిమా డే.. చీకటి రోజు

నెల్లూరు(బారకాసు) : హిరోషిమా డే చరిత్రలో ఓ చీకటి రోజు అని ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్‌ నేత డాక్టర్‌ కాలేషా అన్నారు. నగరంలోని ఏసీసుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అని యునైటెడ్‌ మెడికల్‌ అండ్‌ హెల్త్‌ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ కాలేషా మాట్లాడుతూ 1945 ఆగస్టులో జపాన్‌ నగరాలైన హిరోషిమా, నాగసాకిలపై అమెరికా అను బాంబులు ప్రయోగించి మానవ హననం చేయడం చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోయిందన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్‌ ప్రొఫెసర్లు డాక్టర్‌ సాన్‌బాషా, వైద్యులు గంగాధర్‌, ఖాదర్‌వలీ, యూనియన్‌ జిల్లా గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి షేక్‌. సంధానిబాషా తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా పరిష్కారం



బాధితుడి సమస్యను ఆలకిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

• ఎస్పీ డాక్టర్‌ కె.తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్‌) : స్పందన వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ డాక్టర్‌ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్‌ కాన్ఫరెన్స్‌ హాలులో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి 145 మంది తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని ఉద్యోగాల పేరిట కొందరు మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ తరహా ఫిర్యాదులపై తక్షణమే కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్‌ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అడిషినల్‌ ఎస్పీ క్రైమ్స్‌ ప్రసాద్‌, నెల్లూరు రూరల్‌, ఎస్సీ, ఎస్టీ సెల్‌–2, ఏఆర్‌ డీఎస్పీలు పి.వీరాంజనేయరెడ్డి, శ్రీనివాసరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట) : గృహ నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా ప్రజాపరిషత్‌ కార్యాలయంలో సోమవారం సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కారానికి నోచుకుంటున్నాయని తెలిపారు. భూ పట్టా ఇచ్చే సమయంలో అవకతవకలకు తావు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచేలా చూడాలన్నారు. అధిక సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి జిల్లాను మొదటిస్థానంలో నిలపాలన్నారు. కాంట్రాక్టర్లు జాప్యం చేస్తే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. కాంట్రాక్టర్లు అదనంగా పొందిన నగదును రికవరీ చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకుని నిర్మాణాల్లో జాప్యం జరిగితే ఏఈలే బాధ్యత వహించాలన్నారు. పరిశ్రమల వల్ల ఇబ్బందులు పడే ప్రాంతాల్లో భూమి ఇచ్చిన వారికి ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. యాజమాన్యాల ఇష్టప్రకారం కాకుండా నిబంధనల మేర ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్‌ హరినారాయణన్‌ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందుల్లేకుండా వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. భూ సమస్యల పరిష్కారంలో ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్‌, నెల్లూరు ఆర్డీఓ మలోల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోషకాహార పంపిణీపై విజిలెన్స్‌ పరిశీలన



సరుకులు సక్రమంగా అందాయా అని ఆరాతీస్తున్న ఇన్‌స్పెక్టర్‌ సుధాకర్‌రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్‌ అధికారులు

నెల్లూరు(క్రైమ్‌) : అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహార పంపిణీపై విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగా సోమవారం విజిలెన్స్‌ అధికారులు బృందాలుగా విడిపోయి కావలి మండలం గౌరవరం ఎస్సీ, ఎస్టీ కాలనీ, గమళ్లపాళెంతో పాటు సైదాపురం మండలంలోని తలుపూరు, కలిచేడు, వేమూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీ సక్రమంగా జరుగుతుందా? లేదా అనే విషయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సదరు తనిఖీల్లో నాణ్యమైన బియ్యం, కందిపప్పు, గుడ్లు, పామాయిల్‌, రాగి, జొన్న పిండి, బెల్లం, చిక్కీలు, ఖర్జూర పండ్లు తదితరాలను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేస్తున్నారని, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిల్వలు సైతం సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఇన్‌స్పెక్టర్‌లు వి.సుధాకర్‌రెడ్డి, పి.పెంచలరెడ్డి, తహసీల్దార్‌ జీఎస్‌ కృష్ణప్రసాద్‌, డీసీటీఓ కె.విష్ణురావు, ఏఈ బి.వెంకటరెడ్డి, వ్యవసాయాధికారి పి.వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు క్రిస్టియన్ల శాంతి ర్యాలీ



మాట్లాడుతున్న క్రైస్తవ నేతలు

నెల్లూరు(బృందావనం) : మణిపూర్‌లో జరిగిన దారుణ ఘటనలను నిరసిస్తూ మంగళవారం శాంతి నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు జిల్లా క్రిస్టియన్ల సమైఖ్య వేదిక పిలుపునిచ్చింది. నగరంలోని డానీహాల్‌లో ఆ సమైఖ్య వేదిక నేతలు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని సుబేదారుపేట ఏబీఎం కాంపౌండ్‌ నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శాంతీయుత ర్యాలీ కనకమహాల్‌ సెంటర్‌, గాంధీబొమ్మ, వీఆర్సీ సెంటర్‌, పాత జెడ్పీ ఆఫీసు, బారకాసు మీదుగా కలెక్టర్‌ కార్యాలయం చేరుతుందన్నారు. సమావేశంలో దయాసాగర్‌, సురేంద్రబాబు, రాజశేఖర్‌ దాసరి, గుర్రం అరుణ్‌కుమార్‌, శరత్‌, ఎలీషాకుమార్‌ పాల్గొన్నారు.

## ప్రభుత్వరంగ బ్యాంకును ఏర్పాటు చేయాలి



53వ డివిజన్‌లో ప్రజాపోరు యాత్ర సాగిస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌) : నగరంలోని 53, 54 డివిజన్లకు చెందిన 50 వేల మంది కోసం ప్రభుత్వరంగ బ్యాంకును ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా, నగర అధ్యక్షులు మూలం రమేష్‌, కత్తి శ్రీనివాసులు కోరారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా రెండో రోజు సోమవారం నగరంలోని 53వ డివిజన్‌ పరిధిలో వెంకటేశ్వరపురం, ఇస్లాంపేట, లక్ష్మీవీధి, అంబేడ్కర్‌ నగర్‌, నల్లకాలువ, పునరావాస కాలనీ, గాంధీగిరిజన కాలనీ ప్రాంతాల్లో జరిగిన యాత్రలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ గిరిజన కాలనీ ప్రజలు వెంకటేశ్వరపురానికి వచ్చేందుకు రైలు పట్టాలు దాటాల్సి వస్తోందని, వెంటనే అండర్‌బ్రిడ్జిను నిర్మించాలన్నారు. గతంలో వెంకటేశ్వరపురంలో ఉన్న బ్యాంకును నవాబుపేటకు తరలించడంతో 50 వేల మంది ప్రజలు అవస్థలు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వ బ్యాంకును ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, సూర్యనారాయణ, ప్రసాద్‌, నరసింహ, పద్మ, సుబ్బమ్మ, జాఫర్‌, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.